క్లుప్తంగా

సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు


మొబైల్‌లో ఫలితాలు చూస్తున్న యువకులు

రాయికల్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆదివారం రాయికల్ పట్టణంలోని ప్రజలు, యువకులు టీవీలకు అతుక్కుపోగా యువకులు ఎప్పటికప్పుడు అభ్యర్థుల గెలుపు ఓటములు తెలుసుకున్నారు. ఉదయం నుంచే యువత సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


రాయికల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాయికల్: పట్టణంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పాత బస్టాండ్‌లో దివ్యాంగులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చెంగలి మహేశ్, నాయకులు రాజారం, గంగాధర్, తిరుపతి, గంగరాజం, మదిర, బాలయ్య పాల్గొన్నారు.

రాయికల్‌లో బీఆర్ఎస్ నాయకుల సంబరాలు


టపాసులు కాలుస్తున్న నాయకులు

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల ఆదివారం రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో బీఆర్ఎస్ గెలుపు సంబరాలు


నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

మెట్‌పల్లి: కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ విజయం సాధించడం పట్ల పట్టణంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. సంజయ్‌ని గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కథలాపూర్‌లో కాంగ్రెస్‌కు 1,187 ఓట్ల మెజార్టీ

కథలాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం నిర్వహించగా... వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి 1,187 ఓట్ల మెజార్టీ వచ్చింది. మండలంలో 19 గ్రామాలుండగా.. 41 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌కు 9,883 ఓట్లు రాగా.. బీఆర్ఎస్‌కు 8,696 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌కు 1,187 ఓట్ల మెజార్టీ వచ్చినట్లయింది. బీజేపీ మూడో స్థానానికి పరిమితమైంది. మండలంలో 19 గ్రామాలకు గాను 12 గ్రామాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ, 7 గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఓట్లు వచ్చాయి. పోలింగ్ బూత్‌లవారీగా వచ్చిన ఓట్ల జాబితాలను చూసి ఆయా పార్టీల నాయకులు లోపాలపై చర్చించుకోవడం విశేషం.

ఎన్నికల ఫలితాలపై గల్ఫ్ దేశాల నుంచి ఆరా

రాయికల్: రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఫలితాలపై గల్ఫ్‌లోని దుబాయ్, అబుదాబీ, షార్జా, కువైట్, ఖతర్‌లో ఉన్న తెలంగాణకు చెందిన నాయకులు ఎప్పటికప్పుడు మొబైల్స్ ద్వారా ఆరా తీశారు. తమ నియోజకవర్గంలో ఏఏ అభ్యర్థులు గెలిచారంటూ, గెలిచిన అభ్యర్థులకు ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.


లొత్తునూరులో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


బుగ్గారంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంబరాలు


ధర్మపురిలో నాయకుల సంబరాలు


పెగడపల్లిలో నాయకుల నృత్యం


కథలాపూర్‌లో ఆనందోత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు


కొత్త దామరాజుపల్లి బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

గెలుపు సంబరాలు

ధర్మపురి : ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గెలుపొందడంపై కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద డీజే సౌండుల మధ్య కార్యకర్తలు నృత్యాలు చేశారు.టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

పెగడపల్లి:ధర్మపురి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలుపు పట్ల ఆ పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, ప్రధానంగా ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పేర్కొన్నారు.

గొల్లపల్లి: ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, సర్పంచులు చిర్ర గంగాధర్, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, వెంకటపద్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో కథలాపూర్ మండలంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. గ్రామకూడళ్ల వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

మేడిపల్లి మండలంలో..

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గెలవడంతో మేడిపల్లి, భీమారం మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసున్నారు. 14 ఏళ్ల వనవాసం పూర్తయ్యిందని మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి తెలిపారు.

మల్యాలలో కాంగ్రెస్ సంబరాలు

మల్యాల: చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు మల్యాల మండల కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అఖండ మెజారిటీతో గెలిచిన సందర్భంగా వెల్గటూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి.

బుగ్గారం: ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజయం సాధించడంతో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.వందలాది కార్యకర్తలు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆడిపాడారు.

మల్లాపూర్, కోరుట్లలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.


అడ్లూరి గెలుపు సంబరాల్లో వెల్గటూర్ కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పోటా పోటీగా బీజేపీకి ఓట్లు

జగిత్యాల/జగిత్యాలజోన్: జగిత్యాల నియోజకవర్గం ఎన్నికల్లో బీజేపీ పార్టీని ప్రజలు అంతంతమాత్రంగానే ఆదరిస్తారని ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భావించాయి. అయితే, ప్రధాన పార్టీలను తలదన్నే రీతిలో బీజేపీ అనూహ్యంగా ఓట్లను రాబట్టి ఆయా పార్టీలకు సవాల్ విసిరింది. తొలుత బీజేపీ పార్టీ అభ్యర్థిగా భోగ శ్రావణిని ప్రకటించినప్పుడు, 10 వేల లోపే ఓట్లు వస్తాయని అందరు భావించారు. బీజేపీ పార్టీ ఏ మేరకు ఓట్లు రాబట్టుకుంటే, ఆ మేరకు అయా పార్టీలకు లాభనష్టాల గురించి చర్చించారు. ఓ దశలో బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును బీజేపీ తీసుకుంటే, తమకు కొంత మేర లాభిస్తుందని కాంగ్రెస్ ఆశపడింది. అయితే, కాంగ్రెస్ ఆశలన్నీ అడియాసలు చేస్తూ, బీజేపీ, బీఆర్ఎస్‌లకు సమానంగా ఓట్లు రాబట్టుకుంది. దీంతో, బీజేపీ పార్టీకి పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా దాదాపు 40 వేల వరకు ఓట్లను రాబట్టుకుంది. బీజేపీకి ప్రతి రౌండ్‌లోను అనూహ్యంగా ఓటింగ్ పెరుగుతూ వచ్చింది.

జగిత్యాలలో బీజేపీకి పెరిగిన ఆదరణ

జగిత్యాలటౌన్: జగిత్యాల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీజేపీకి భారీగా ఓట్లు పోలవడంతో 3వ స్థానంలో నిలిచింది. గత 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ముదుగంటి రవీందర్‌రెడ్డి కేవలం 4654 ఓట్లు మాత్రమే సాధించి బీజేపీ డిపాజిట్ కోల్పోయింది. కాగా ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి 42,138 వేల ఓట్లు సాధించి 3వ స్థానంలో నిలవడం బీజేపీకి పెరిగిన జనాదరణకు నిదర్శనమని రాజకీయ విశ్లేశకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా వార సంత


ధర్మపురి సంతలో వాహనదారుల ఇబ్బందులు

బుగ్గారం: నియోజకవర్గ కేంద్రం ధర్మపురి పట్టణంలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంత అస్తవ్యస్తంగా తయారైంది. సంత రోజున చుట్టు పక్కన గల గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి తమకు అవసరమైన సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఏటికేడు సంత విస్తరిస్తుండడంతో వ్యాపారులు సైతం అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో స్థలం సరిపోక సంత రోజున ప్రధాన రహదారిపైనే అనేక మంది వ్యాపారులు తమ సరుకులను విక్రయిస్తుంటారు. ఇదే క్రమంలో రోడ్లపైనే తోపుడు బండ్ల వ్యాపారులు తమ వ్యాపారాన్ని సాగిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా వీకెండ్‌లో వేలాదిగా తరలివచ్చే యాత్రికుల వాహనాలతో మార్కెట్‌లో ప్రతీ వారం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వందలాది వాహనాలు రోడ్డు మీదే ఆగి వినియోగదారులకు సైతం తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.ప్రతీవారం ఇలాగే జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.వారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం


సారంగాపూర్‌లో శిథిలమవుతున్న సెర్ప్ భవనం


కార్యాలయం చుట్టూ పెచ్చులూడుతున్న భవనం

సారంగాపూర్: మండల కేంద్రంలో 2007లో నిర్మించిన సెర్ప్ భవనం రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతోంది. సారంగాపూర్ గ్రామ సమాఖ్య సమావేశాల కోసం ఏర్పాటు చేసిన ఈ భవనం ప్రస్తుతం మండల సమాఖ్య కార్యాలయం (మండల జాగృతి మహిళా సమాఖ్య) భవనంగా వినియోగిస్తున్నారు. రూ.10 లక్షలతో ఈ భవనం రెండు ఫ్లోర్‌లుగా నిర్మించాలని నిర్ణయించారు. నిధుల లేమితో ఒక ఫ్లోర్‌గా నిర్మాణం మాత్రం పూర్తి చేసి, రెండో ఫ్లోర్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించి కొంతమేర పనులు ప్రారంభించారు. నిధుల లేక పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం భవనం పెచ్చూలూడుతున్నాయి. చాలా వరకు ప్లాస్టింగ్ (సిమెంట్ పూతలు) దెబ్బతిన్నాయి. కొన్ని కిటికీలు ఊడిపోయాయి. భవనం వెనుకవైపు, ఇరువైపులా కనీసం సున్నం కూడా వేయలేదు. అధికారులు స్పందించకపోతే భవనం మరింత శిథిలమైపోయే అవకాశం ఉందని మహిళలు పేర్కొంటున్నారు.



పోచమ్మతల్లి బోనాలు

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగులో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించిన అనంతరం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించిన అనంతరం తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కలిసొచ్చిన కార్యాలయం


కోరుట్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం

కోరుట్ల: 2009లో కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్ ఏర్పాటు నుంచి కోరుట్లలోని మెయిన్ రోడ్ వెంట తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం బీఆర్ఎస్‌కు కలిసొచ్చింది. 2009, 2010,2014,2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఇదే కార్యాలయం నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు కొనసాగించి విజేతగా నిలిచారు. విద్యాసాగర్‌రావు తనయుడు డా.కల్వకుంట్ల సంజయ్ సైతం ఈ ఎన్నికల్లో ఇదే కార్యాలయం నుంచి పార్టీ కార్యకలాపాలు నిర్వహించి విజయం సాధించడం చర్చనీయాంశగా మారింది. మొత్తం మీద కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పార్టీకి కలిసొచ్చిందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.